నమస్తే తెలంగాణ
నాగర్‌కర్నూల్
5 | మహబూబ్‌నగర్, బుధవారం 13 నవంబర్ 2024 | NAGARKURNOOL

నా భర్తను నాకు అప్పగించాలి

అర్ధరాత్రి 2 గంటలకు 30 మంది పోలీసులు మా ఇంటి తలుపు తట్టి కొట్టారు. నేను తలుపు తెరిచిన వెంటనే నా భర్తను పోలీసులు బలవంతంగా తీసుకెళ్లారు. నేను ప్రెగ్నెంట్‌గా ఉన్నాను. నా భర్తను తీసుకెళ్లొద్దని ఎంత చెప్పినా పోలీసులు వినిపించుకోలేదు. మా ఆయన ఉదయం.. సాయంత్రం పాల బండికి పోతాడని, ఆయన ఎవరి జోలికిపోడన్నా.. పోలీసులు వినిపించుకోలే. పోలీస్ వచ్చి డోరు తీస్తారా..? పగల గొట్టెలా? అని బెదిరించారు. తండాలో ఎవరూ లేరు.. నాకు ఏమైనైతే.. ఎవరు చూసుకుంటారు.. మా భూములు ఉన్నాయి.. అని మాపై దౌర్జన్యం చేస్తున్నారు. మా ఊరుపై బాంబు వేసి మా అందరి ని చంపేసి భూములను తీసుకోండి. నా భర్తను రాత్రి వరకు అప్పగించకపోతే నేనే చనిపోతాను.. **– జ్యోతి, పులిచర్ల తండా**

కొడుకు బర్తుడే చేయకుండా..

మంగళవారం కొడుకు పుట్టిన రోజు కావడంతో తన భర్తతో వెంకటేశ్‌తో కలిసి నేను లగచర్లలోని అత్తగారింటికి వచ్చాం. అర్ధరాత్రి దాటాక అకస్మాత్తుగా పోలీసులు ఇంటిపైకి వచ్చి మా ఆయన్ను అరెస్టు చేసి తీసుకెళ్లారు. ఎందుకు అరెస్టు చేస్తున్నారు.. ఉదయం ఇంట్లో మా కొడుకు బర్తుడే ఉన్నదని చెప్పినా వినిపించుకోలేదు. మా ఇంటాయన అరెస్టుతో ఇంట్లో శుభకార్యం నిలిచిపోయింది. ఇంట్లో ఎలాంటి పండుగ జరుపకోకుండా పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నానంటూ కన్నీరు పెట్టుకున్నది. **– తుడుం భాగ్యశ్రీ, లగచర్ల**

కర్ఫ్యూ వాతావరణం

ఉన్నత అధికారులపై దాడి చేశారని చెబుతూ లగచర్ల, రోటిబండతండాలో అర్ధరాత్రి అరెస్టుల పర్వం కొనసాగింది. తెల్లవారు జామున ఈ రెండు తండాలు నిర్మానుష్యంగా మారిపోయాయి. కదిలిస్తే కన్నీళ్లే సమాధానమిస్తున్నాయి. తమ వాళ్లే మైవాతీవ్రవాదులా.. అర్ధరాత్రి వచ్చి తీసుకెళ్లడానికి అంటూ అమాయకంగా ప్రశ్నిస్తున్నారు. తీసుకు వెళ్లిన వారిని బేషరతుగా వదిలిపెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. కాయకష్టం చేసి సంపాదించిన భూములు ఇచ్చేది లేదని తేల్చి చెప్పారు. విలువైన భూములు ఇచ్చి ఫార్మాసిటీలో బాత్రూంలో కడగాలా? అంటూ ప్రశ్నిస్తున్నారు. కాగా ఫార్మసిటీకి భూములు ఇవ్వబోమని తేల్చి చెప్పిన పాపానికి ఆ తండాలపై ప్రభుత్వం కక్ష కట్టిందని గిరిజన సంఘాలు ఆరోపిస్తున్నాయి.

లగచర్లలో ఇండ్లకు తాళాలు వేసిన దృశ్యం

అర్ధరాత్రి బూట్ల చప్పుళ్లు..

దర్వాజాలపై లాఠీ దెబ్బలు

- చీకట్లోనే పలువురిని అరెస్టు చేసిన పోలీసులు
- బిక్కుబిక్కుమంటున్న లగచర్ల, రోటిబండతండా
- కన్నీరుమున్నీరవుతున్న రెండుగ్రామాల వాసులు

నారాయణపేట/కోస్గి, నవంబర్ 12 : ప్రశాంతమైన పల్లెల్లో.. ఫార్మా అనే రెండు అక్షరాలు చిచ్చుపెట్టాయి. పట్టపగలే ఆ పేరు ఎత్తితే ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా ఆరు గ్రామాల ప్రజలు హడలెత్తి పోతున్నారు. కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలం లగచర్ల గ్రామంలో ఫార్మా కంపెనీకి భూములు ఇవ్వాలంటూ అభిప్రాయ సేకరణకు సోమవారం వచ్చిన వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి తదితరులపై రైతులు దాడి చేశారు. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో మంగళవారం గ్రామం నిర్మానుష్యంగా మారింది. ఈ సంఘటన తర్వాత చాలా మంది గ్రామం వదిలి ఇతర ప్రాంతాలకు వెళ్లి తలదాచుకున్నారు. సంఘటనతో ఎలాంటి సంబంధం లేని వారు గ్రామంలోనే ఉండిపోయారు. కలెక్టర్ స్థాయి అధికారులపై దాడి, పైగా ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం కావడంతో ఏమో కానీ పోలీసులు ప్రెస్టిజ్ ఇష్యుగా తీసుకున్నారు. ఎందుకంటే పట్టపగలు కాకుండా అర్ధరాత్రి విద్యుత్ సరఫరా నిలిపివేసి, ఇంటర్నెట్ సేవలు బంద్ చేయించి మరీ మరీ గ్రామంలోకి వచ్చిన దాదాపు 300 మంది పోలీసులు తమ బూటు చప్పుళ్లతో గ్రామంలోని ఇంటింటినీ జల్లెడ పట్టినట్లు తెలుస్తోంది. తమ వెంట తెచ్చుకున్న లాఠీలతో గడియ పెట్టిన ఇండ్లు తెరిచే వరకు కొట్టి మరీ తెరిపించారు. ఇంట్లో ఉన్న వాళ్లను అదుపులోకి తీసుకెళ్లినట్లు గ్రామస్తులు రోదిస్తూ వాపోయారు. అసలు తాము గొడవ వద్దకు వెళ్లలేదని, గొడవతో తమకు ఎలాంటి సంబంధం లేదని చెప్పినా వినిపించుకోకుండా బలవంతంగా పోలీస్ వాహనాలోల ఎక్కించుకొని వెళ్లినట్లు స్థానికంగా ఉన్న మహిళలలు, వృద్ధులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ భర్తలను, కొడుకులను ఈ అర్ధరాత్రి ఎక్కడికి తీసుకెళ్తున్నారని ప్రశ్నించినా..? బదులు చెప్పకుండా ఇష్టనుసారంగా, ఎవరు దొరికితే వారిని గ్రామం నుంచి తరలించినట్లు చెబుతున్నారు. ఇలా అదుపులోకి తీసుకున్న వారిని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించి విచారిస్తున్నట్లు సమాచారం.

నిర్మానుష్యంగా రెండు గ్రామాలు

లగచర్ల, రోటిబండ తండాలను 'నమస్తే తెలంగాణ' బృందం సందర్శించగా గ్రామంలో నిర్మానుష్య వాతావరణం కనిపించింది. గ్రామంలోని రోడ్లపై ఒక్కరు కూడా తిరుగుతూ కనిపించలేదు. చాలా వరకు ఇండ్లకు తాళాలు వేసి కనిపించాయి. అక్కడక్కడ ఒకటి, రెండు ఇండ్లు తెరిచి ఉన్నప్పటికీ ఆ ఇంట్లో వాళ్లు బయటికి కనిపించకుండా ఉండిపోయారు. గ్రామంలోని బడులకు సైతం సెలవు ఇవ్వడంతో రెండు పాఠశాలలకు తాళం దర్శనమిచ్చాయి. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇంటింటి సర్వే సైతం సోమవారం గ్రామంలో చేపట్టకుప్పటికీ మంగళవారం మాత్రం నిర్వహించినట్లు.. సర్వే బృందాలు తిరిగినట్లు కనిపించలేదు.

విలపిస్తున్న స్థానికులు

తమ ప్రాణాలు పోయినా.. తమ భూములు ఇచ్చేది లేదని ఖరాఖండిగా చెప్పినా.. బలవంతం పెట్టి ఎలా భూములు లాక్కుంటారని, ఇది ఎంత వరకు న్యాయమని, ఫార్మా కంపెనీ ఏర్పాటుతో భూములను కోల్పోయే రైతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పంట పొలాలే తమకి జీవన ఆధారమని, అలాంటి భూములను లాక్కొని కంపెనీ ఏర్పాటు చేస్తే తమ కుటుంబాలు రోడ్డున పడుతాయని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఫార్మా కంపెనీ ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పాపకు అన్నప్రాసన చేద్దామనుకున్నాం

మా పాపకు ఆరు నెలలు. మంగళవారం అన్నప్రాసన చేద్దామని అనుకున్నాం.. కానీ రాత్రి మా ఆయన్ను పోలీసులు తీసుకెళ్లారు. కలెక్టర్, అధికారులపై స్థానికులు చేసిన గొడవలో మా ఆయన లేడు. పోలీసులతో మొరపెట్టుకున్నా వారు వినిపించుకోలేదు. ఫార్మా కంపెనీకి సంబంధించిన భూములు కూడా మాకు లేవు.. అని పోలీసోళ్లకు చెప్పినా వినిపించుకోలేదు. **– ఆద్విక, లగచర్ల**

- అర్ధరాత్రి లగచర్ల, రోటిబండ తండాల్లో అలజడి
- కరెంటు తీసి.. ఇంటర్‌నెట్ సేవలు నిలిపివేత
- కలెక్టర్‌పై దాడి కేసులో అదుపులోకి పలువురు
- తీవ్రవాదుల్లా తీసుకెళ్తారా..? అంటూ స్థానికుల నిలదీత
- ఫార్మా కంపెనీ మాకొద్దు.. మమ్మల్ని తీసుకెళ్లి చంపండంటూ ఆగ్రహం
- సీఎం నియోజకవర్గంలో పోలీస్ రాజ్యం
- భయం గుప్పిట్లో పలు గ్రామాలు

పోలీస్ జులుం

మహబూబ్‌నగర్, నవంబర్ 12 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఫార్మా కంపెనీ నెలకొల్పేందుకు భూసేకరణపై ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణ ఉద్రిక్తతకు దారితీసింది. ఈ నేపథ్యంలో వికారాబాద్ కలెక్టర్, కాడ స్పెషల్ ఆఫీసర్ తోపాటుమరి కొందరిపై స్థానికులు దాడి చేసిన ఘటన తెలిసిందే. ఈ నేపథ్యంలో పోలీసులు తెల్లవారుజామున గిరిజన తండాలపై దాడి చేసి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం అర్ధరాత్రి తర్వాత 2:30 గంటల సమయంలో దాదాపు 300 మంది పోలీస్ బలగాలతో చేరుకున్నారు. ఇండ్లలోంచి బయటకు లాగి అదుపులోకి తీసుకొన్నారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలం లగచర్ల, రోటిబండతండాను చుట్టుముట్టి అరెస్టుల పర్వం కొనసాగించారు. కాళ్లావేళ్లా పడినా పోలీసులు కనికరించలేదు. ఇళ్లల్లో ఉన్న మగవాళ్లందరినీ లాక్కెళ్లారు. అర్ధరాత్రి ఒక్కసారిగా భారీగా పోలీసు బలగాలు తండాల్లోకి ప్రవేశించడంతో స్థానికులు భయాందోళన చెందారు. అర్ధరాత్రి వచ్చి అరెస్టు చేయడం ఏమిటని స్థానిక మహిళలు ప్రశ్నిస్తున్నారు. ఈ ఘటనతో రెండు గ్రామాలు నిర్మానుష్యంగా మారాయి. పథకం ప్రకారం ముందుగా పోలీస్ అధికారులు విద్యుత్ సరఫరాను తొలగించారు. ఆ తర్వాత ఇంటర్‌నెట్ సేవలను నిలిపివేయించి సెల్‌ఫోన్లు పనిచేయకుండా ఉదయం వరకు నెట్‌వర్క్‌ను ఆపేయించారు. ఇదంతా దాడి చేసిన వారిని అరెస్టు చేయడానికే.. అయితే తమ భర్తలు, కొడుకులు, మనమళ్లు తీవ్రవాదుల్లా రాత్రి వేళల్లో వచ్చి తీసుకెళ్లడం ఏమిటని మహిళలు నిలదీశారు. 'ఫార్మా కంపెనీకి భూములు ఇవ్వం.. అంటే ఇంత దౌర్జన్యం చేస్తారా'..? అంటూ నిలదీశారు. 'తీసుకెళ్లి జైల్లో పెట్టి.. మమ్మల్ని చంపిన తర్వాత ఫార్మా కంపెనీలు పెట్టండి'.. అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అదు పులో తీసుకున్న గ్రామస్తులను బేషరతుగా వదలాలని డిమాండ్ చేశారు. కాగా ఈ ఘటనలో కుట్రకోణం దాగుందని పోలీసులు సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేయడం గమనార్హం. అంతేకాకుండా దీనికి కారకులైన వారి కాల్ డేటాను సేకరించి ఇదంతా పథకం ప్రకారం చేసినట్లు సృష్టించే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. దీంతో పోలీసుల తీరుపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. సీఎం నియోజకవర్గంలో పోలీస్‌రాజ్యం నడుస్తుందని గిరిజన సంఘాలు ఆరోపిస్తున్నాయి. కాగా లగచర్లలో బాధితులకు సంఘీభావం తెలిపేందుకు వస్తున్న బీఆర్ఎస్ బృందాన్ని వికారాబాద్ పోలీసులు అడ్డుకున్నారు. మరోవైపు బీజేపీ ఎంపీ డీకే అరుణ బుధవారం లగచర్లకు వెళ్లి బాధితులను పరామర్శించి వారికి మద్దతు తెలిపేందుకు వెళుతున్నట్లు మీడియాకు వివరించారు.

అర్ధరాత్రి లగచర్లలో హల్‌చల్

కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలం రోటిబండతండా, లగచర్లలో అర్ధరాత్రి పోలీసులు గ్రామాల్లోకి ప్రవేశించి కనపడిన వాళ్లందరినీ అదుపులోకి తీసుకొన్నారు. కొందరి ఇండ్లల్లోకి చొరబడి బయటకి తీసుకొచ్చి చితకబాదుతూ డీసీఎం వాహనంలో ఎక్కించారు. కాళ్లావేళ్లా పడినా వినకుండా అదుపులోకి తీసుకున్నారు. అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు అరెస్టుల పర్వం కొనసాగింది. అదుపులోకి తీసుకున్న వారందరినీ పరిగి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఫార్మా కంపెనీలకు భూములు ఇచ్చేది లేదని, ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకొని కలెక్టర్, ఇతర అధికారులపై పలువురు దాడులు చేసిన విషయం విదితమే. ఈ ఘటనకు పాల్పడిన నాలుగు కేసులు నమోదు చేసినట్లు వికారాబాద్ ఎస్పీ ప్రకటించారు.

ప్రధాన నిందితుడి కోసం గాలింపు

లగచర్లలో అధికారులపై దాడి కేసులో ప్రధాన నిందితుడైన సురేశ్ కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నట్లు పోలీసులు ప్రకటించారు. ఈ ఘటనకు తానే కారణమని పోలీసు యంత్రంగా ఆరోపిస్తుంది. అయితే ముఖ్యమంత్రి రేవంత్ నియోజకవర్గంలో ఫార్మా కంపెనీల కోసం తమ భూములను లాక్కోవద్దని సురేశ్ కొన్ని నెలలుగా గిరిజన తండాలను ఏకం చేసి ఆందోళన చేపడుతున్నారు. ఈ ఫార్మా క్లస్టర్‌పై ఎక్కడ ప్రజాభిప్రాయం జరిగినా అక్కడికి గిరిజనులను తీసుకువెళ్లి వారితో ధర్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ నేతలతో సంబంధం ఉన్నదని పోలీసులు ఆరోపిస్తూ కాల్‌డేటా సేకరించినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్నది. అసలు వ్యవహారాన్ని కప్పిపుచ్చేందుకు సీఎంవో ఆదేశాలతో బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని బీఆర్ఎస్ నేతలు మండిపడుతున్నారు.

ప్రతినిధి బృందాన్ని అడ్డుకున్న పోలీసులు

ఫార్మా బాధితులను సంఘీభావం తెలిపేందుకు వస్తున్న బీఆర్ఎస్ బృందాన్ని వికారాబాద్ పోలీసులు అడ్డుకున్నారు. వారిని మన్నెగూడ వద్ద నిలువరించి వెనక్కి పంపించి వేశారు. గ్రామానికి వెళితే ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటాయని, శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతాయని, అందుకే వెనక్కి పంపినట్లు పోలీసు యంత్రాంగం ప్రకటించింది. కాగా సీఎం సొంత నియోజకవర్గంలో ఫార్మా కంపెనీల కోసం ఏకంగా కలెక్టర్, ఇతర అధికారులపై దాడి చేసిన ఘటనను పోలీసు అధికారులు సీరియస్‌గా తీసుకొన్నారు. దీనిపై అదనపు డీజీ మహేశ్ భగవత్‌కు నివేదిక సమర్పించాలని డీజీపీ ఆదేశించారు. లగచర్లలో ఏర్పాటు చేసే ఫార్మా కంపెనీని గిరిజనులు వ్యతిరేకించడంతో దీనిపై మంత్రి శ్రీధర్ బాబు రాష్ట్ర రాజధానిలో వికారాబాద్ జిల్లా అధికారులతో కలిసి సమీక్షించారు. మొత్తంపై సీఎం సొంత నియోజకవర్గంలో ఏర్పాటవుతున్న కంపెనీపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

ధాన్యం కొనాల్సిందే..

హన్వాడలో రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

- కేంద్రం ప్రారంభించి వారమైనా కొనుగోళ్లు ఎప్పుడు ప్రారంభిస్తారు?
- రైతు భరోసా డబ్బులు ఎప్పుడిస్తారు?
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

హన్వాడ, నవంబర్ 12 : రైతులు ఆరుగాలం, రాత్రనకా.. పగలనకా.. తేడా లేకుండా కష్టపడి పండించిన పంటను పండించి అమ్మేందుకు తీసుకొస్తే ఎందుకు కొనుగోలు చేయడం లేదని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రశ్నించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు సేవా సహకార సంఘం ఆవరణలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు చేయడం లేదని అక్కడి రైతులు శ్రీనివాస్‌గౌడ్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా సాయాన్ని ఇవ్వకున్నా.. రైతులు అప్పులు తెచ్చి పంటలు సాగు చేశారని తెలిపారు. తీరా పండిన ధాన్యాన్ని విక్రయించేందుకు కేంద్రానికి తీసుకొస్తే కొనకపోవడం సిగ్గుచేటన్నారు. కేంద్రాలను ప్రారంభించి వారం రోజులు కావస్తున్నా ఇంకా ఎందుకు కొనుగోళ్లు ప్రారంభించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు పండించిన ప్రతి గింజాను కొంటామని గొప్పలు చెబుతున్న ప్రభుత్వం కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యం కొనడంలో ఎందుకు జాప్యం వహిస్తున్నట్లు వివరించాలన్నారు. రెండు పంటలకు రైతు భరోసా ఇవ్వలే.. పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయలే.. అని ఆరోపించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వకుంటే రైతులతో కలిసి ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. ధాన్యం కొనుగోలు చేశాక వారంలోపే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. అక్రమ కేసులు ఎన్ని పెట్టి బెదిరించినా భయపడేది లేదని తేల్చిచెప్పారు. కాగా కేసీఆర్ ప్రభుత్వంలో కంఫర్‌గా రైతుబంధు వచ్చేదని, కాంగ్రెస్‌కు ఓటేసి మోసపోయామని.. మళ్లా బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నామని పలువురు రైతులు అన్నారు. శ్రీనన్న వెంట మాజీ ఎంపీపీ బాలరాజు, మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మయ్య, మాజీ ఎంపీటీసీ నాగన్న, మాజీ సర్పంచ్ చిన్న చెన్నయ్య, నాయకులు శ్రీనివాసులు, మాధవులు గౌడ్, వెంకటయ్య, చెన్నయ్య పాల్గొన్నారు.

మా భూములను ఇప్పించండి

కల్వకుర్తి రూరల్, నవంబర్ 12 : తర్నికల్ గ్రామంలో జాగీర్‌దారులనుంచి కొనుగోలు చేసిన భూములను తిరిగి తమకే ఇప్పించాలని కోరుతూ మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్‌కు తర్నికల్ గ్రామ రైతులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఎన్నో ఏండ్లుగా తాము జాగీర్‌దారుల నుంచి కొన్న భూములను సాగు చేస్తూ ఉపాధి పొందుతున్నామని, కొంతమంది భూకబ్జాదారులు ఆ భూములను తమవి అని చెప్పి లాక్కుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి అక్రమార్కుల చెర నుంచి మేము సాగు చేసుకుంటున్న భూములను ఇప్పించాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో తర్నిక తోపాటు చుట్టుపక్కల గ్రామాల రైతులు కూడా పాల్గొన్నారు.

పురుగుల అన్నం నీళ్లచారు మాకొద్దు..

- వెల్దండ బీసీ వసతిగృహ విద్యార్థుల డిమాండ్
- జాతీయ రహదారిపై రాస్తారోకో

వెల్దండలో జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న బీసీ హాస్టల్ విద్యార్థులు

వెల్దండ, నవంబర్ 12 : ఉడికీ ఉడకని పురుగులు, రాళ్ల అన్నం, నీళ్ల చారు మాకొద్దని వెల్దండ బీసీ హాస్టల్ విద్యార్థులు రోడ్డెక్కారు. మంగళవారం వెల్దండ బీసీ బాలుర వసతిగృహం విద్యార్థులు పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో స్థానిక హైదరాబాద్ –శ్రీశైలం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ కొద్ది రోజులుగా అన్నంలో పురుగులు, రాళ్లు వస్తున్నాయని, కూరగాయాలు కూడా సక్రమంగా చేయడం లేదని, నీళ్ల చారు పోస్తున్నారని ఎలా తినాలని ప్రశ్నించారు. ఈ విషయాన్ని ఇదివరకే వార్డెన్‌కు చెప్పినా పట్టించుకోవడం లేదని, వంట నిర్వాహకుల మధ్య సమన్వయ లోపం వల్ల వంటలు సరిచేయడం లేదని ఆరోపించారు. అదేవిధంగా హాస్టల్‌లో మౌలిక వసతులు కూడా సక్రమంగా లేవని మరుగుదొడ్ల నుంచి తీవ్ర దుర్గంధం వెదజల్లుతుందని, హాస్టల్ ఆవరణలో మురుగునిలవడంతో దోమలకు నిలయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా హాస్టల్ గదులకు సరిగా డోర్లు, కిటికీలు కూడా లేకపోవడంతో రాత్రి వేళలో చలికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయడంతో పాటు మెనూ ప్రకారం భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆందోళన విషయం తెలుసుకున్న బీసీ వెల్ఫేర్ డివిజన్ అధికారి ఖాజాన జమీలీతో పాటుపోలీసులు అక్కడికి చేరుకొని విద్యార్థులకు నచ్చజెప్పడంతో వారు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు సంతోష్‌తో పాటువిద్యార్థులు పాల్గొన్నారు.

అలుగును పట్టుకున్న ముఠాతో అటవీ అధికారులు

పట్టుబడిన 'అలుగు' ముఠా

- 12 మందికి రిమాండ్, పరారీలో ఒకరు
- వివరాలు వెల్లడించిన అటవీ శాఖ జిల్లా అధికారి రోహిత్ గోపిడి

అచ్చంపేట, నవంబర్ 12 : అలుగులను అమ్ముతున్న ముఠాపై కేసు నమోదైంది. అచ్చంపేట టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోని పదర మండలం మద్దిమడుగు సమీపంలో అలుగును వేటాడి ఇతర రాష్ట్రాలకు అమ్ముతున్న ముఠాలోని 12 మందిని అదుపులోకి తీసుకోగా.. ఒకరు పరారీలో ఉన్నట్లు అటవీ శాఖ అధికారి రోహిత్ గోపిడి తెలిపారు. మంగళవారం అచ్చంపేట మండలంలోని మన్ననూర్‌లో ఉన్న అటవీ శాఖ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ పదర మండలంలోని పిల్లిగుండ్లకు చెందిన శీలం బుద్ధయ్య, శీలం అంజయ్య, నిమ్మల భానుప్రసాద్, మద్దిమడుగుకు చెందిన ఉడుతల వెంకటేశ్, ఉడి విక్షకు చెందిన చిగుర్ల అంజి, చిట్లంకుంటకు చెందిన మండ్లి వీరయ్యతో పాటు నాగార్జున సాగర్‌కు చెందిన శీలం యాదయ్య, ఉదండాపూర్‌కు చెందిన గజ్జి బాలరాజు, నడింపల్లికి చెందిన పురం సాయికుమార్, కంసానిపల్లికి చెందిన కలమందల అశోక్(గౌతమ్), బాపన్‌పాడుకు చెందిన జెల్ల బయ్యన్న, సంగాడ్డికి చెందిన శ్రీమతి వడ్డె లక్ష్మీ, కోనాపూర్‌కు ప్రాంతానికి చెందిన రమేశ్‌ను అరెస్టు చేశారు. అలాగే ఉడి విక్షకు చెందిన చిగుర్ల అంజి పరారీలో ఉన్నాడు. వీరిపై వన్యప్రాణి సంరక్షణ యాక్ట్ 1972 ప్రకారం కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు చెప్పారు. సమావేశంలో అటవీ శాఖాధికారులు రామేశ్వర్‌రావు, తిరుమలరావు, రామ్మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

బొలెరో బోల్తా.. కూలీలకు గాయాలు

- బాధితులకు మాజీ ఎమ్మెల్యే ఆల పరామర్శ

బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల

మదనాపురం, నవంబర్ 12 : వ్యవసాయ కూలీలతో వెళ్తున్న బొలెరో వాహనం టైరు పగిలి అదుపుతప్పి బోల్తాపడడంతో పలువురు వ్యవసాయ కూలీలకు గాయాలైన ఘటన మంగళవారం కొత్తకోట మండలం కనిమెట్ట వద్ద చోటు చేసుకున్నది. ఎస్సై మంజునాథ్‌రెడ్డి కథనం ప్రకారం కొత్తకోట మండలం భూత్కూర్‌కు చెందిన 30మంది మహిళా కూలీలు బొలెరో వాహనంలో మహబూబ్‌నగర్ జిల్లా ఎంకపల్లి గ్రామానికి పత్తి ఏరేందుకు వెళ్తున్న సమయంలో జాతీయ రహదారిపై కనిమెట్ట శివారులోని బాల్‌రెడ్డి దాబా సమీపంలో ఒక్కసారిగా టైరు పగలడంతో వాహనం అదుపుతప్పి కిందపడిపోయింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా అందరికీ స్వల్పగాయాలయ్యాయి. గాయపడిన వారిని వెంటనే వనపర్తి ఏరియా దవాఖానకు తరలించారు. గాయపడిన వారిలో ముగ్గురు కొత్తకోట పట్టణానికి చెందిన వారు కాగా మిగతా వారు భూత్కూరు గ్రామానికి చెందిన వారిగా గుర్తించినట్లు ఎస్సై పేర్కొన్నారు. బొలెరో ప్రమాదంలో గాయపడి వనపర్తి ప్రభుత్వం దవాఖానలో చికిత్స పొందుతున్న వ్యవసాయ కూలీలను మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పరామర్శించి ఆర్థిక సాయం చేశారు.

SVS హాస్పిటల్, మహబూబ్‌నగర్
ప్రపంచ మధుమేహ దినోత్సవం - World Diabetis Day
ఉచిత మధుమేహ వైద్య శిబిరం
FREE DIABETIC HEALTH CAMP
14-11-2024 గురువారం ఉ.9-00 గం॥ నుండి సా.4-00గం॥ల వరకు
SVS హాస్పిటల్‌లో ఉచిత మధుమేహ వైద్య శిబిరం ఏర్పాటు చేయబడినది. ఈ వైద్య శిబిరంలో మెడిసిన్, సర్జరీ, ఆర్థోపెడిక్స్, నెఫ్రోలజీ, న్యూరాలజీ మరియు కంటి వైద్య విభాగాల డాక్టర్లతో పాటు న్యూట్రిషన్ విభాగం స్పెషలిస్టులు కూడా వైద్య సేవలకు, సలహాలకు, సూచనలకు అందుబాటులో ఉంటారు. ఉచిత డాక్టర్ సంప్రదింపులతో పాటు క్రింద తెలుపబడిన వైద్య పరీక్షలు ఉచితంగా చేయబడును.
FBS PPBS GRBS ECG Micro Albumin
Fundus Examination Serum Creatinine
గమనిక :- అవసరమున్న వారికి క్రింది పరీక్షలు తక్కువ రేటుకే చేయబడును.
Dopler (Single Limb) Rs. 800/- - Rs.400/-
Dopler (Both Limb) Rs. 1600/- - Rs.800/-
Dexa Scan Rs. 3000/- - Rs.900/-
వివరాలకు 7893888529/ 6303444232 నంబర్ల పై సంప్రదించగలరు.
Dept. of General Medicine & Dept. of Nutrition